

కొడంగల్ రూపురేఖలు మార్చాలి

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గం రూపురేఖలను మార్చాలని, అందుకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు బీటీ రోడ్లు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కళాశాల, తదితర పనులకు సంబంధించిన 12 శిలాఫలకాలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు రూ.107.53 కోట్ల నిధులు మంజూరు చేసి, చెక్కును అందించారు. దుద్యాల మండలం పోలేపల్లి గ్రామానికి అడిగిన వెంటనే మహిళాసంఘం భవనాన్ని మంజూరు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌గారి అమ్మమ్మ గారి ఊరు పోలేపల్లి అని ముఖ్యమంత్రి తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మహిళా సంఘాల వ్యవస్థ మొదటగా పాలమూరులోనే ప్రారంభమైందని, 1995లో దౌల్తాబాద్‌లో గులాబీ మహిళాసంఘం ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్‌కు అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ వచ్చినప్పుడు, ఆయనకు మహిళా సంఘాల గురించి వివరించింది గులాబీ సంఘం వారేనని గుర్తు చేశారు. అందుకు ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ప్రకటిస్తున్న సీఎం రేవంత్



స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం; చిత్రంలో మంత్రులు

గుండెల్లో పెట్టుకొని.. చూసుకుంటా

- కొడంగల్ ప్రజలు భుజాలపై మోసి సీఎంను చేసి.. గుర్తింపు తెచ్చారు
- పాలమూరు ప్రజలను మోసం చేసినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం
- పీఆర్ఎల్ఐ జాతీయ హోదాకు మోదీ ఇచ్చిన హామీపై సమాధానం చెప్పాలి
- చల్లా వంశీచంద్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి
- కోస్గి కాంగ్రెస్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



కోస్గి సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నల్లమల ప్రాంతంలోని కుగ్రామం నుంచి వచ్చిన నన్ను ఆశీర్వదించి.. కొడంగల్ ప్రజలు తమ భుజాలపై మోసి.. సీఎంను చేయడంతోపాటు ఢిల్లీ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. పాలమూరు గడ్డ అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే ఈ స్థాయిలో ఉన్నాన'ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి రూ.4,369 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం కోస్గి పట్టణంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమాఖ్య సమీపంలోని మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో నోరు లేకున్నా.. పాలమూరులో ఊరు లేకున్నా.. కరీంనగర్‌లో ఓటమి భయంతో పారిపోయి పాలమూరుకు వస్తే.. కేసీఆర్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించారని, కానీ పదేళ్ల తన పాలనలో పాలమూరుకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాధించుకున్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. పాలమూరుకు అత్యంత నష్టం చేసే విధంగా ఏపీ సీఎం జగన్ రోజుకు 12 టీఎంసీలు తరలించుకునే విధంగా పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులకు అవకాశం కల్పించారని, ప్రగతి భవన్‌కు పిలిచి భోజనాలు పెట్టి పంపించారని అన్నారు. రోజా ఇంట్లో పులుసు తిని బలిసిపోయి.. 203 జీవో ద్వారా కృష్ణా నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. అభివృద్ధి ముసుగులో పాలమూరును దోచుకుని.. ఓట్ల కోసం మళ్లీ ప్రజా పోరుబాట పేరుతో పాదయాత్ర చేయడానికి వస్తున్నారన్నారు. అంతకంటే ముందు కేసీఆర్ పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రజలు చీత్కరించిన తర్వాత కూడా ఏ మొఖం పెట్టుకుని యాత్రలు చేస్తారని విమర్శించారు. పాలమూరుకు జాతీయ హోదా ఇస్తానని 2014లో మోదీ హామీ ఇచ్చారని, నేటికీ హోదా ఇవ్వకపోడానికి ఈ ప్రాంత నాయకులైన డీకే అరుణ, జితేందర్‌రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. కిషన్‌రెడ్డి అయిదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉండి.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్‌కు తట్టెడు మట్టి తీయించలేదని ఎద్దేవా చేశారు. సిమెంట్ పరిశ్రమలు, రైల్వేలైన్, కృష్ణానది జలాలు రావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో 50 వేల మెజారిటీ ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఇచ్చిన నిధులతో పాటు మరో రూ. ఐదు వేల కోట్లు నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు.



సభకు హాజరైన జనం

ఈ ప్రాంతాన్ని పట్టించుకోలే: కోమటిరెడ్డి

కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి వల్ల అందరికీ సుపరిచితమైందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతం కరువు, వలసలతో అల్లాడితే పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా పట్టించుకోలేదన్నారు. కేవలం గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలను మాత్రమే అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. కమీషన్ల కక్కుర్తి వల్ల పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసిన కేసీఆర్ రేవంత్‌రెడ్డి ఎడమకాలి గోటికి సరిపోరని విమర్శించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.



వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు

నారాయణపేటకు జీవధార: ఉత్తమ్

తన అనుభవంలో ఒకేరోజు నియోజకవర్గానికి రూ.4,369 కోట్లతో నిధులతో పనులను ప్రారంభించుకోవడం ఇదే మొదటిసారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో కొడంగల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కొడంగల్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మించాలని తలపెట్టినా పట్టించుకోలేదని అన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం తీవ్ర దుర్భిక్షమైన ఈ జిల్లాకు జీవధారగా నిలుస్తుందని అన్నారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో 7.10 టీఎంసీల మిగులు జలాలతో రూ. 2945.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ముందు ప్రతిపాదించిన లక్ష ఎకరాల ఆయకట్టుకు అదనంగా మరో 30వేల ఎకరాలు చేర్చి.. 1.30లక్షల ఎకరాల ఆయకట్టును నిర్దేశించామని అన్నారు. మొత్తం నాలుగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని అన్నారు. భూత్పూరు నుంచి ఉట్కూరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి జాజాపూర్‌కు, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కానుకుర్తి రిజర్వాయర్‌కు నీరును లిఫ్ట్ చేస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

పాలమూరును కృష్ణా డెల్టా చేస్తాం: జూపల్లి కృష్ణారావు

అంచెలంచెలుగా ఎదిగి.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు సాగునీటి ప్రాజెక్టులతో పాటు.. విద్యా, వైద్య, రోడ్ల సదుపాయాలను కల్పించేందుకు భారీ నిధులతో శంకుస్థాపనలు చేయడం గర్వంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరును మరో కృష్ణా డెల్టాలాగా మారుస్తామని అన్నారు.

మరో జలయజ్ఞం: వంశీచంద్‌రెడ్డి

పాలమూరులో ప్రస్తుతం నీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ.. కాంగ్రెస్ జలయజ్ఞంలో చేపట్టినవేనని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపనతో రాష్ట్రంలో మరో జలయజ్ఞం ప్రారంభమమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డి బలాన్ని ఇంకా పెంచాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి జడ్పీ చైర్లన్లు సునీత, సరిత తిరుపతయ్య, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామెల్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, చెంచు సంఘం నాయకులతో సమావేశమైన పీవో

ఐటీడీఏలో గ్రీవెన్స్‌డే

- అధికారులతో ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి సమీక్ష సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్ననూర్, ఫిబ్రవరి 21: చెంచుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఇక నుంచి ప్రతీ బుధవారం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్(గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి తెలిపారు. 'మన్ననూరు ఐటీడీఏకు మహర్దశ లభించేనా' అనే శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పీవో స్పందించారు. ఈ మేరకు బుధవారం మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, ఆదివాసీ, చెంచు నాయకులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలను నిర్వహించారు. చెంచు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్‌మన్ పథకం పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చెంచు పెంటల్లో ఆధార్‌కార్డులు అందరికీ అందేలా చూడాలని చెప్పారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల వీటీడీఏలతో చర్చించి, అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు. ఆదివాసీల అతిపెద్ద జాతర అయిన సమ్మక్క సారలమ్మ జాతరకు నల్లమల ఆదివాసీల తరఫున మన్ననూరు ఐటీడీఏ నుంచి పసుపు, కుంకుమ, చీర, సారెలను చెంచు పెద్దలు, ఆడపడుచుల ద్వారా పంపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నల్లమలలోని భౌరాపూర్‌లో మహాశివరాత్రి రోజు జరిగే చెంచుల జాతర, సలేశ్వరంలో జరిగే లింగమయ్య ఉత్సవాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, డిప్యూటీ ఈవో శంకర్ నాయక్, ఐకేపీ ఏపీడీ లక్ష్మయ్య, మన్ననూరు ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, చెంచు సంఘాల నాయకులు రాజేంద్ర ప్రసాద్, చిర్ర రాములు, పెద్దిరాజు, గురువయ్య, లింగయ్య పాల్గొన్నారు.



ఇంటి పైకప్పు తొలగించి మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ఇంట్లోంచి దట్టంగా వస్తున్న పొగలు

షార్ట్ సర్క్యూట్‌తో.. వస్త్ర దుకాణం దగ్ధం

- వస్త్రాలు, ఇంటి నిర్మాణం కలిపి రూ.80 లక్షల ఆస్తినష్టం

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 21: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.80 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బాధితులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న అగ్రహారం కాలనీలో ప్రవీణ్ ఇంట్లో చంద్రబాబు అనే వ్యక్తి కొంత కాలంగా వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు వచ్చాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. ఇంటి గదులు చిన్నవిగా ఉండటం, వాట్లతో కూడిన పైకప్పు ఉండటంతో ఫైర్ సిబ్బందికి లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. పైకప్పు కూలి పోయే స్థితికి రావడంతో పైకప్పు తొలగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే వస్త్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతింది. వస్త్ర దుకాణం, ఇంటి నిర్మాణం మొత్తం కలిసి రూ.80 లక్షల దాకా ఆస్తినష్టం సంభవించినట్లు ప్రవీణ్, ఫైర్ సిబ్బంది గౌస్‌పాష చెప్పారు. తమకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లడం వల్ల పక్కన ఉన్న ఇళ్లకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నామని గౌస్‌పాష చెప్పారు. ఫైర్ సిబ్బంది రాందాస్, లక్ష్మన్ననాయుడు, గౌస్ పాష, ఖాజాపాష మంటలను ఆర్పారు.

సంఘటనా స్థలం పరిశీలన

వస్త్ర దుకాణం దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

పాలమూరులో బీజేపీ జెండా ఎగిరితే సమగ్రాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన యాత్రలో క్రాకర్ గన్ కాలుస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి, డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి అవుతున్నారని, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపిస్తే పాలమూరు సమగ్రాభివృద్ధిని సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో చేపట్టిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు మోదీ నినాదంతో హోరెత్తిస్తున్నారని చెప్పారు. విజయ సంకల్పయాత్ర బుధవారం రాత్రి మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గడియారం చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు అద్భుతంగా మారాయన్నారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.వంద కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్ల మోదీ హయాంలో ఆడబిడ్డలు, రైతన్నల సంక్షేమం, యువత భవిష్యత్తు, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తారని ప్రకటించారన్నారు. అవినీతి, దోపిడీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరు ప్రజలు ఎన్నో అన్యాయాలకు గురయ్యారన్నారు. కాంగ్రెస్ హయాంలో మత కలహాలు, హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయని, మోదీ పాలనలో మెరుగైన శాంతిభద్రతలు నెలకొన్నాయని అన్నారు. 500 ఏళ్ల క్రితం ఆక్రమించి ఒక నిర్మాణం చేపట్టారని, రాముడి జన్మ స్థలంలో మోదీ హయాంలో తిరిగి బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేసుకోవటం జరిగిందన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మహబూబ్‌నగర్‌లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ మాట్లాడారు. బంగారు శృతి, ఏపీ మిథున్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పడాకుల బాలరాజు, అచ్చుగట్ల అంజయ్య, రామాంజనేయులు, శివ పాల్గొన్నారు.

మోదీతోనే అవినీతి రహిత పాలన

దేవరకద్ర: : మోదీతోనే దేశంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం రెండో రోజు దేవరకద్రకు చేరుకుంది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కోశాధికారి శాంతకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డిలు యాత్రలో పాల్గొన్నారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి బైక్ ర్యాలీతో యాత్రకు స్వాగతం పలికారు. కొత్త బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు కుటుంబ పాలనతో బాగుపడ్డాయని, ప్రజలే నరేంద్రమోదీ కుటుంబ మన్నారు. డీకే అరుణ మాట్లాడుతూ మోదీ మరోసారి పీఎం కావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవరకద్రలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పట్టణ ఆర్యవైశ్యులు కిషన్‌రెడ్డికి వినతి పత్రాం అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎంపీ గెలిచిన వెంటనే బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నంబి రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి, డీకే అరుణ

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన ప్రాణాపాయం



కాల్వలోకి దూసుకెళ్లిన కారు

పాన్‌గల్, ఫిబ్రవరి 21: బైక్‌ను తప్పించబోయి కాల్వలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని అన్నారం తండా సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన ముగ్గురు వ్యక్తులు కొల్లాపూర్‌లో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం తండా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయ్యారు. దాంతో కారు రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అయితే ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రాణాపాయం తప్పింది.

స్వామివారికి హంస వాహన సేవ


హంస వాహన సేవలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : తెలంగాణ తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వామివారిని పల్లకిలో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాసరాజు, అడిషనల్ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాస్, ఆలయ వంశపార ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, ఫెస్టివల్ ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల


డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : యూనివర్సిటీలో యూజీ, పీజీ ఫలితాలు ఇంకా మెరుగుపడాలని పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ సూచించారు. బుధవారం పీయూలోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్ కుమార్, యూజీ, పీజీ కళాశాలల డైరెక్టర్‌తో కలిసి పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫలితాలు విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఫలితాలు కొంత పెరిగినా ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, మొదటి సెమిస్టర్‌కు 21,743 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 6,974 మంది ఉత్తీర్ణత సాధించారు. 7,709 మంది పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్‌లో 17,401 మంది హాజరుకాగా, 7,749 మంది ఉత్తీర్ణత సాధించారు. 5,206 మంది విద్యార్థులు పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. ఐదో సెమిస్టర్‌లో 13,211 మంది పరీక్ష రాయగా, 6,758 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,986 మంది విద్యార్థులు పైతగరతులకు ప్రమోట్ అయ్యారు. పరీక్ష ఫలితాలను పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు చూసుకోవచ్చని తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చినట్లు భావించే విద్యార్థులు, ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డికి స్వాగతం పలికిన పీయూ విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం పాలమూరు యూనివర్సిటీకి వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పీయూ ఏబీవీపీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పరిపాలనా భవనం వద్ద పీయూ వీసీ అధికారులతో కలిసి కిషన్‌రెడ్డి రాక కోసం వేచి ఉండగా యూనివర్సిటీ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థులు పరిపాలన భవనం వైపు మళ్లే సర్కిల్ వద్దనే కిషన్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, సమస్యలు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వినతి పత్రం తీసుకొని పరిపాలన భవనం వద్దకు రాకుండా అక్కడ్నుంచే తిరిగి వెళ్లిపోయారు. గమనించిన వీసీ వెంటనే సర్కిల్ వద్దకు వెళ్లి కిషన్‌రెడ్డి తదుపరి కార్యక్రమం జరిగే ప్రదేశంలో పూలబొకె ఇచ్చి స్వాగతం పలికారు. విద్యార్థులు ముందే ఆపి స్వాగతం పలకడం ద్వారా కోఆర్డినేషన్ సమస్య వల్ల తప్పిదం జరిగిందని కిషన్‌రెడ్డికి వివరించారు. అనంతరం పీయూకి రూ.వంద కోట్లు మంజూరు చేసినందుకు, మంజూరు కావడానికి కృషి చేసిన కిషన్‌రెడ్డికి, డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. మరోమారు పీయూకి వస్తామని వీసీకి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాట పట్టారు. వాహనాలు,



బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.


సమ్మక్కగద్దె

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొర

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం


జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ బృందం చైర్మన్‌గా కర్ణాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టీసీ.తారానాథ్, కోఆర్డినేటర్ సభ్యుడిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.జయచంద్రారెడ్డి, సభ్యుడిగా అస్సాం రాష్ట్రం జోర్హాట్ జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్‌లు కళాశాలను సందర్శించారు. గత సంవత్సరం మార్చి 15, 16వ తేదీల్లో న్యాక్ బృందం పర్యటించింది. కాగా, కళాశాలలో చేపట్టిన అభివృద్ధికి గుర్తింపుగా కేవలం బి++ గ్రేడ్ రావడంతో, సరైన గ్రేడ్ రాలేదని, పునఃపరిశీలించేందుకు మళ్లీ పర్యటించాలన్న కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తాజాగా న్యాక్ బృందం రెండురోజుల పాటు కళాశాలలో పర్యటించనుంది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, సదుపాయాలు, వసతులు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాలకు కేటాయించాల్సిన గ్రేడ్ అంశంపై సిఫారసు చేయనున్నారు. న్యాక్ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరుపై మొదటగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలతో పాటు అదనంగా కావాల్సిన వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి, హెర్బేరియంను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాధిపతులతో మాట్లాడి, ఆయా విభాగాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం అలూమ్ని సమావేశ గదిలో పూర్వ విద్యార్థులతో సమావేశం అయ్యారు. కళాశాలకు కావల్సిన సదుపాయాల కోసం అలూమ్ని ద్వారా ఇప్పటికే రూ.66లక్షలకు పైగా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అలూమ్ని అధ్యక్ష, కార్యదర్శులు పాలాదిరాంమోహన్, బాదిమి రవిశంకర్‌లు వివరించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా గురువారం సైతం బృందం కళాశాలలో పర్యటించనుంది. కళాశాలకు కేటాయించే గ్రేడ్‌కు సంబంధించిన పూర్తి నివేదికను యుజిసికి అందించనున్నట్లు న్యాక్ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అలూమ్ని కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసులకు బేసిక్ ఇండక్షన్ శిక్షణ ప్రారంభం



జడ్చర్లలోని డీటీసీలో శిక్షణ సూచన పుస్తకాలను అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల సమీపంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్ల(పురుషులు)కు తొమ్మిది నెలల పాటు బేసిక్ ఇండక్షన్ శిక్షణను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్ ప్రారంభించారు. శిక్షణ సూచనల పుస్తకాలను అందచేసే కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన 213 కానిస్టేబుల్స్‌కు నేటి సమాజంలో రకరకాల మోసాలు, నేరాలను అరికట్టేందుకు శిక్షణ ఎంతో దోహదపడుతుందని వివరించారు. క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలని, నేరాలను అరికట్టడంతో పాటు, ప్రజలకు సేవలు అందించే నిష్ణాతులైన కానిస్టేబుళ్లు తయారు కావాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరు మానసికంగా, శారీరకంగా శిక్షణ పొంది, అవార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రామారావు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణా సిబ్బంది, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

» విద్యార్థి సంఘాల నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న పీయూ విద్యార్థి సంఘాల నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని పీయూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీ మెయిన్‌గేట్ నుంచి పరిపాలన భవనం వరకు వారు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాములు మాట్లాడుతూ పీయూలో వృత్తి విద్యా కోర్సులు, ప్రొఫెషనల్ కోర్సు లు, ఇంజనీరింగ్, లా వంటి కోర్సులు ఏర్పాటుచేయడం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అత్యధికంగా లాయర్లు, జడ్జీలు, ఇంజనీర్లు కావాలని, ఎక్కడో దూరప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారని, ఈ కోర్సులు ఇక్కడే ఏర్పాటుచేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఉల్లి రైతులకు నిరాశ



మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఉల్లి పోటెత్తింది. వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లిని విక్రయించేందుకు వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావాదేవీల్లో ఉల్లి ధర రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. వ్యాపారులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.1650, కనిష్ఠంగా రూ.900 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. ఉల్లిలో తెల్లగా, నాణ్యంగా ఉన్నవాటికి కొంతవరకు డిమాండ్ ఉండగా, ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. విత్తనాలు కొనే సమయంలో ఉల్లి రకం ఎలా ఉంటుందో తెలియని రైతులు దిగుబడి వచ్చాక నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 365 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు ఎల్లయ్య తెలిపారు.

విజయసంకల్ప యాత్ర పోస్టర్ విడుదల



జడ్చర్లలో బీజేపీ సంకల్ప యాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను బుధవారం జడ్చర్లలో ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈనెల 23వ తేదీన షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి జడ్చర్ల నియోజకవర్గంలోకి యాత్ర ప్రవేశించనున్నదని పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం అనే నినాదంతో విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీతారాంరుూవర్, ముచ్చర్ల కృష్ణయ్య, రాపోతులశ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, నర్సిములు, మధు, రాజశేఖర్‌రెడ్డి, కొంగళిశ్రీకాంత్, ఆంజనేయులు, సాహితిరెడ్డి, నవీన్, వెంకట్, జగదీశ్, జ్యోతి, అంజలి తదితరులున్నారు.

అరటి గెలల లోడు లారీ బోల్తా



అరటి గెలలను తీసుకెళ్తున్న వాహనదారుడు

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జాతీయ రహదారి జడ్చర్ల మండలం గొల్లపల్లి శివారులోని లలితాంబిక తపోవనం సమీపంలో అరటి గెలల లోడుతో ఉన్న లారీ బోల్తా పడింది. అనంతపురం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో లారీలో ఉన్న అరటి కాయలు రోడ్డుపై పడ్డాయి. రోడ్డుపై పడిన అరటి గెలలను అటుగా వెళ్తున్న వారంతా ఎత్తుకెళ్లారు. కొందరు ద్విచక్ర వాహనంపై, మరికొందరు కారు డిక్కీలో నింపుకుని వెళ్లడం కొసమెరుపు. ఈ ఘటనలో దాదాపు రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : ప్రమాదవశాత్తు కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన బీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(38) మృతి చెందాడు. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై శ్రీనివాస్‌రెడ్డి తొమ్మిదిరేకుల గ్రామం నుంచి గంగాపురం గ్రామానికి వెళ్తూ కోడ్గల్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి భార్య బీంరెడ్డి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మో.. నేను రాను నవాబ్‌పేటకు

» జంకుతున్న అధికారులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 21 : మండలంలో ముఖ్యమైన శాఖల్లో అధిపతులుగా చేరేందుకు ఆయా శాఖల అధికారులు జంకుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో ఆయా స్థానాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇతర ప్రాంతాలు, మండలాల్లో పనిచేస్తున్న అధికారులు ఇక్కడకు రావాలంటే జంకుతున్నారు. ముఖ్యంగా ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీలత బదిలీపై వెళ్లిపోవడంతో ఆమె స్థానం ఖాళీ అయింది. అలాగే తహసీల్దార్ మల్లికార్జున్‌రావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సైతం అధికారులు బాధ్యతలు స్వీకరించేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. అధికార పార్టీ నేతలు తమకు అనుకూలంగా ఉండే వారిని తీసుకురావడంలో బిజీగా ఉన్నారు. అయితే అధికారులు ఇక్కడకు రావాలంటే ఇబ్బందులు తప్పవన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పనిచేస్తున్న కొందరు అధికారులు తమను మాత్రం ఆ మండలానికి బదిలీ చేయవద్దంటు ఉన్నతాధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నట్లు తెలిసింది.

ఇసుకను తరలించొద్దు

» అయ్యవారిపల్లిలో రైతుల ధర్నా
» నచ్చజెప్పేందుకు ప్రయత్నించిన పోలీసులు



పోలీసులతో మాట్లాడుతున్న గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు

మిడ్జిల్, ఫిబ్రవరి 21 : తమ గ్రామం డార్క్ ఏరియాగా ఉండటంతో వర్షపు నీరు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గత ప్రభుత్వాల హయాంలో చెక్ డ్యాంలను నిర్మించారని, నేడు ఇసుకను తరలించడంతో తమ బతుకులు ఆగమవుతాయని, తమ గ్రామం నుంచి ఇసుకను తరలించొద్దని అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టి, ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుదర్శన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంగారెడ్డితో పాటు, గ్రామానికి చెందిన పలువురు నాయకులు దుందుభీవాగు పరిరక్షణ పేరుతో ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు పలికారు. గతంలో ఇసుక తరలింపులు చేపడతుంటే ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వాగులో ధర్నా చేసి ఇసుకను తరలించొద్దని ఆందోళన చేపట్టారని నేడు రైతులు ధర్నా చేస్తే ఎందుకు మద్దతునివ్వడంలేదన్నారు. ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఉంటే జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇసుక ఉందని, అక్కడి నుంచి తీసుకెళ్లాలన్నారు. తమ ప్రాంతం నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే తాము ఆత్మహత్యలు చేసుకోవడానికి వెనుకాడేది లేదని పలువురు రైతులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సీఐ నాగార్జున, ఎస్సై ఆనంద్‌లు రైతులు చేపట్టిన ధర్నా వద్దకు చేరుకొని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఇసుక తరలింపు ప్రదేశం నుంచి హిటాచీతో పాటు, ఎక్స్‌కవేటర్లను తీసుకెళ్లాలని, లేకపోతే ధర్నాను విరమించేదిలేదని పట్టుబట్టారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు నర్సింహ్మారెడ్డి, మల్లేష్, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పరంధాములు, ఆంజనేయులు, చిమిడి కృష్ణయ్య రాజశేఖర్‌రావు, హుస్సేన్, ఆంజనేయులు, జగన్‌గౌడ్, శ్రీకాంత్, గోపాల్, బీంరాజుతో పాటు, గ్రామస్థులు ఉన్నారు.

బీసీలకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

» రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే టికెట్ కేటాయించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో బుధవారం బీసీ సేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాశ్, రైతురాజ్యం పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ.బాలకృష్ణ, ముడా మాజీ డైరెక్టర్ బాదిమి రవిశంకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం జెండాలను మోసే కార్యకర్తలుగానే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీసీలకే టికెట్‌లు కేటాయించాలని కోరారు. బీసీలకు కాకుండా ఇతరులకు టికెట్ కేటాయించిన పార్టీలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన బీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడానికి ముందుకు రాని వైనంపై కొందరు నాయకులు ప్రశ్నించారు. సమావేశంలో జహంగీర్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, ప్రకాష్‌చారి, చెన్నయ్య, నిరంజన్, ఆంజనేయులు, శంకర్, నర్సిములు, విజయ్ కుమార్, గోపాల్, మాచారంశ్రీనివాస్, లింగంపేట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం

» పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి



వెన్నాచేడ్‌లో లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి

గండీడ్, ఫిబ్రవరి 21 : ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనాన్ని కొనసాగించవచ్చని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలో అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, మాట్లాడారు. గ్రామంలో ఆధ్యాత్మికతపై ప్రత్యేక శ్రద్ధ సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, గోపాల్, అనంతలక్ష్మారెడ్డి, నాయకులు చిన్నయ్య, రాములు, రామలింగం, రాములు నర్సిములు, పులేందర్‌రెడ్డి, శరణు రాఘవేందర్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, వేద పండితులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

నాణ్యత గల సరకును తీసుకురావాలి

» మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు



బాదేపల్లి మార్కెట్‌లో రైతులు తీసుకువచ్చిన వేరుశనగను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతి

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : నాణ్యతతో కూడిన సరకును మార్కెట్‌కు తీసుకువస్తే గిట్టుబాటు ధర తప్పక వస్తుందని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు సూచించారు. బాదేపల్లి మార్కెట్‌ను బుధవారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తీసుకువచ్చిన వేరుశనగతో పాటు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను వారు పరిశీలించారు. గిట్టుబాటు ధర అంశంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కు విక్రయానికి తీసుకువచ్చే సరకును నాణ్యతతో తీసుకురావాలని సూచించారు. బాదేపల్లి మార్కెట్‌కు రెగ్యులర్ కార్యదర్శిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి గోపీనాథ్ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్‌తో రైతుకు ఆదాయం

» ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డా.కే.సురేష్



గుండ్లపొట్లపల్లిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.కే.సురేష్

పాలమూరు, ఫిబ్రవరి 21 : ఉద్యాన రైతులు మెళకువలు పాటించి ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్, పెద్దవేగి (ఆంధ్రప్రదేశ్)డైరెక్టర్ కె.సురేష్ తెలిపారు. బుధవారం రాజాపూర్ మండలం గుండ్లపొట్లపల్లి గ్రామంలో డా.సురేందర్‌రెడ్డి ఆయిల్‌పామ్ తోటలో ఉమ్మడి జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతులకు సదస్సు నిర్వహించారు. ఇండియన్ ఆయిల్‌ఫామ్ పరిశోధన సంస్థ డైరెక్టర్ ప్రధాన శాస్త్రవేత్త డా.రామచంద్రుడు, ఉద్యానశాఖ సంయుక్త డైరెక్టర్ వి.సరోజినిదేవి, బీఎస్.రావు, రామమోహనరావులు రైతులకు అవగాహన కల్పించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 2019-20లో 234 ఎకరాలు, 2022-23లో 2,104, 2023-24లో నేటివరకు 1,400ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను రైతులు నాటినట్లు వివరించారు. సాగులో రైతులకు దిగుబడి, చీడపీడల నుంచి తోటను ఎలా సంరక్షించుకోవాలో వివరించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

దేవరకద్ర, ఫిబ్రవరి 21 : ఎండాకాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కౌకుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హన్వాడ, ఫిబ్రవరి 21 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని గ్రామ ప్రత్యేక అధికారి కవిత ఉపాధ్యాయులను కోరారు. బుధవారం నాయినోనిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే వస్తువులతో భోజనాన్ని చేసి విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు పెద్దచెన్నయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నర్సిములు, మోహన్, తిరుపతయ్య, సత్యం, బాలవర్ధన్, తిరుపతయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి

మిడ్జిల్, ఫిబ్రవరి 21 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వస్పుల, అయ్యవారిపల్లి గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్‌లలో అడ్మిషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో చదివితే కలిగే లాభాల గురించి వివరించారు. అధ్యాపకులు, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్‌ల పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని గాజులపేట గ్రామ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ కిట్‌లు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలకు 250, ప్రాథమిక పాఠశాలకు వంద కిట్లు పంపిణీ చేశామని స్వచ్ఛంద సంస్థ సభ్యులు వరదాసు, మల్లేష్‌లు తెలిపారు. కిట్‌లో విద్యార్థులకు సంబంధించిన నోట్‌బుక్కులు, పెన్నులు, షూ, స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫామ్‌లు ఉంటాయని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం, బ్యాగుల అందజేత

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల మండలం పెద్దపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, బ్యాగులను పాఠశాల హెచ్‌ఎం, గ్రామస్థులు అందించారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సమీపంలోని విర్కో ఫార్మా పరిశ్రమ ఆధ్వర్యంలో సీఎస్ఆర్‌పీలో భాగంగా విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులను అందజేసినట్లు ఫార్మా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బాదేపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నరసింహచారి, శ్రీనివాస్‌యాదవ్, యాదయ్య రాములు తదితరులున్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి శ్రీసరస్వతి శిశుమందిరంలో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. అ, ఆ అక్షరాల ఆకారంలో విద్యార్థులు కూర్చుని మాతృభాషపై ఉన్న మక్కువను చాటుకున్నారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల్లో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మిడ్జిల్, ఫిబ్రవరి 21 : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్‌ను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుమతమ్మ, ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మతీన్‌లు బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రతీ ఒక్కరూ నీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు హన్వాడకు సంకల్ప యాత్ర

హన్వాడ, ఫిబ్రవరి 21 : బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం హన్వాడకు రానుందని పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రముఖులు రానున్న ఈ యాత్రకు నాయకులు హాజరై, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైద్య శిబిరం విజయవంతం

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : మహబూబ్‌నగర్ మండలంలోని కోటకదిర గ్రామంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-5 ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఏడు రోజుల శీతాకాల శిక్షణలో భాగంగా ఎస్వీఎస్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్థులకు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఇచ్చారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఎస్వీఎస్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగరాజు, మాజీ సర్పంచ్ మల్లు రమ్యదేవేందర్‌రెడ్డి, కార్యదర్శి మాధవి, హెచ్‌ఎం హరనాథ్, ఎంవీఎస్ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి యజమానుల పేర్లు సరి చేయాలి

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో ఇంటి యజమానులు పేర్లు ఆన్‌లైన్‌లో సరి చేయాలంటూ కావేరమ్మపేటకు చెందిన శివకుమార్ బుధవారం మునిసిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సందర్భంలో ఇంటి యజమాని పేరును మార్చుకోవడం జరిగిందని, పంచాయతీ విలీనం అయిన తర్వాత మార్చినా కూడా గతంలో ఉన్నవారి పేర్లు వస్తున్నాయంటూ వివరించారు.

సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ తీరు మార్చుకోవాలి

» జనరల్ ఆసుపత్రి ఎదుట శానిటేషన్ కార్మికుల ధర్నా

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఫిబ్రవరి 21 : జనరల్ ఆసుపత్రిలోని సాయి సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ అక్రమాలను నిరసిస్తు శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు ఆసుపత్రి ఆవరణలో బుధవారం ధర్నా చేశారు. కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీ కాంట్రాక్టరు శ్రమదోపిడీ చేస్తున్నారని, వేతనాల్లో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. సరైన సమయంలో వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నాడని, తక్కువమందిని పెట్టి ఎక్కువమందిని చూపించి ప్రభుత్వంతో డబ్బులు దండుకుంటున్నాడని ఆరోపించారు. కాంట్రాక్టర్ తన తీరును మార్చుకోవాలని, వేతనాల్లో కోత విధించకుండా నెలనెలా వేతనాలు ఇవ్వాలని, పడకలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని లేకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణలో బైఠాయించిన కార్మికులు

తహసీల్దార్, సర్వేయర్‌లను విధుల నుంచి తొలగించాలి

» సీపీఐ ధర్నా

బాలానగర్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ భూమిని పక్క పట్టాదారుకు కొలిచి ఇచ్చిన సర్వేయర్, దానికి మద్దతు ఇచ్చిన తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా కిసాన్‌సంఘ్(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ రైతు సంఘం కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, ప్రధానంగా బాలానగర్ తహసీల్దార్ మాట్లాడే బాష దురుసుగా, నిర్లక్ష్యంగా కూడుకొని ఉందని వాపోయారు. మండలంలో వెంచర్ యాజమాన్యాలు, రియల్ వ్యాపారుల భూకబ్జాలపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని, కబ్జా భూములను రక్షించాలని తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేస్తే ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఓ భూమి విషయంలో మాట్లాడటానికి వెళితే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా కూడా పనిచేయను అని తమను అవమానించాడని ఆరోపించారు. తహసీల్దార్, సర్వేయర్‌ల పనితీరుపై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, కోర్టులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ్, అనిల్, చెన్నయ్య, బాలచెన్నయ్య, మహిళలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు